## కూకట్‌పల్లిలో చెరువులను అభివృద్ధి చేయాలి

### హైడ్రా కమిషనర్ కు ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ వినతి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 22: కూకట్‌పల్లి నియోజకవర్గంలో పలు చెరువులను అభివృద్ధి చేశామని, మిగిలిపోయిన చెరువులను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కురుమయ్యగారి నవీన్ కుమార్ కోరారు. మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ని కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలో 9 చెరువులు, రెండు కుంటలను అభివృద్ధి చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో చెరువు సుందరీకరణ పనులను చేపట్టామని, మిగిలిన పనులను పూర్తి చేయాలని కోరారు. రంగనాథుని (ఐడీయల్) చెరువు, బోయిన చెరువు, ముళ్లకత్వ చెరువు, నల్లచెరువులలో కొంత భాగం సుందరీకరణ పనులు చేశామని, వాటిపై కోర్టు కేసుల దృష్ట్యా ఆ పనులను పూర్తి చేయలేకపోయామని తెలిపారు. న్యాయస్థానంలో కేసులను పరిశీలించి మిగిలిన సుందరీకరణ పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న భూయజమానులు/ కొనుగోలు చేసిన వారు ఎవరైనా ఉంటే వారికి టీడీఆర్ రూపంలో నష్టపరిహారాన్ని అందించాలని కోరారు. చెరువులను అభివృద్ధి చేసే క్రమంలో నల్లచెరువు ఐడీయల్ లాంటి చెరువులలో మురుగునీరు చేరకుండా నాలా డైవర్షన్ చేయాలని, ఆలస్యం చేయకుండా పనులు ప్రారంభించాలన్నారు. చెరువులను కబ్జా చేసిన వారిపై పార్టీలకతీతంగా చర్యలు తీసుకోవాలని, అభివృద్ధిలో మాత్రం జాప్యం జరగకుండా చూడాలని కోరారు. దీనికి హైడ్రా కమిషనర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూయజమానులు, కొనుగోలుదారుల వివరాలను సేకరించి.. టీడీఆర్ ఇప్పించేందుకు చర్యలు చేపడుతారని, చెరువుల అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే అమృత్ నగర్ తండాలో ముంపు సమస్య బాధితులకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని కోరారు. వర్షాకాలంలో ఆ ప్రాంతంలో డ్రైనేజీ నీరు ఇండ్లలోకి చేరుతుందని, ముంపు బాధితులుగా ఆ ప్రాంతంలో 70 కుటుంబాలను గుర్తించి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించే పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ముంపు బాధితులకు కైతలాపూర్ లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని కోరారు. ఈ సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటారని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ఏడాదిగా మత్తు కోసం మందుగోలీలు

### మెడికల్ దుకాణం యజమానితోపాటు సప్లయర్ అరెస్ట్

సిటీబ్యూరో/హుమాయూన్‌నగర్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): నొప్పుల గోళీలను డ్రగ్స్ మందుగా వాడుతున్న యువకులు సంవత్సర కాలంగా ఇలాంటి మందులను వాడుతున్నట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసింది. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నొప్పులకు ఉపయోగించే గోళీలను ఎక్కువ మొత్తంలో తీసుకొని దవాఖానలో రోగులకు ఎక్కించే సెలాయిన్ వాటర్‌లో కలిపి ద్రవ రూపంగా మార్చి, దానిని ఇద్దరు మైనర్లు, ఓ యువకుడు ఇంజక్ట్ చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో బాలుడు(17) మృతి చెందగా, మరో మైనర్‌తో పాటు ఓ యువకుడు ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో యువకులకు నిబంధనలకు విరుద్ధంగా మందులు సరఫరా చేస్తున్న షాహిన్, శంషాబాద్‌లోని శ్రీనివాసమెడికల్ స్టోర్స్ యజమాని ప్రవీణ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. బాలాపూర్ పోలీసులతో పాటు తెలంగాణా యాంటీ నార్కొటిక్ బ్యూరో(టీజీన్యాబ్) దర్యాప్తు జరిపింది. ఈ దర్యాప్తులో మరో ముగ్గురు యువకుల ద్వారా ప్రస్తుతం బాధితులుగా ఉన్న ఇద్దరు మైనర్లు, మరో యువకుడు ఈ ట్యాబ్లెట్లకు అలవాటయ్యారని, ఏడాది కాలంగా యువకులు ఈ అలవాట్లకు బానిసలుగా ఉన్నారనే విషయాన్ని నిర్ధారించారు. ఈ ఘటనపై టీజీ న్యాబ్ జరిగిన ఘటనపై, పోలీసులు నిందితుల అరెస్ట్‌పై వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.

#### రాకెట్ గుట్టు రట్టు..

ఈనెల 17న ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మైనర్, వెల్డింగ్ వర్క్ చేసుకునే అతడి స్నేహితుడు మైనర్, జూమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న ఎండీ షాబాజ్‌లు షాహిన్‌నగర్‌కు చెందిన సయ్యద్ షాహిల్‌ను కలిసి కొన్ని ట్యాబ్లెట్లను తీసుకొని వాటిని పౌడర్‌గా చేశారు. ఆ పౌడర్‌ను సెలాయిన్ వాటర్‌లోలో కలిపి దానిని ఇంజెక్ట్ చేసుకున్నారు. ఇదంతా రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య ఆ రోజు జరిగింది. వాళ్లంతా ఎవరి ఇండ్లకు వాళ్లు వెళ్లారు. మరోసటి రోజు అపస్మారక స్థితిలోకి వెళ్లడతో కుటుంబసభ్యులు మీర్‌చౌక్‌లోని ఓ దవాఖానకు తీసుకెళ్లారు.అందులో ఇంటర్ చదువుతున్న బాలుడి పరిస్థితి విషమించడంతో ఉస్మానియాకు తరలించగా.. చికిత్స పొందుతూ ఈనెల19న మృతి చెందాడు. మిగతా ఇద్దరి పరిస్థితి కూడా విషమించడంతో వేర్వేరు దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు.ఈఘటనపై మృతుడి తండ్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. డ్రగ్స్ మాఫియా, నెట్‌వర్క్‌పై ప్రభుత్వ కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లోనూ పోస్టు చేయడంతో టీజీన్యాబ్ ఈ విషయంపై ఆరా తీసింది. ఈ ఘటనపై బాలాపూర్ పోలీసులతో కలిసి విచారణ జరిపింది. దర్యాప్తులో ట్యాబ్లెట్లు సరఫరా చేసిన షాహిల్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. తాను శంషాబాద్‌లోని సిరూమని జగన్నాథ ప్రవీణ్‌కు చెందిన మెడికల్ దుకాణంలో ఎంఆర్‌పీ ధర రూ.39ఉంటే, రూ.45కు ఎక్కువ మొత్తంలో ట్యాబ్లెట్లు తీసుకుంటున్నానని, వాటిని రూ.150చొప్పున బయట విక్రయిస్తున్నాని వెల్లడించాడు. ఇంతకు ముందు షాహిన్‌నగర్‌కు చెందిన మహ్మద్‌అయాన్, జునైద్‌ఖాన్, మరో బాలుడి ద్వారా ముగ్గురు బాధితులు ప్రభావితమైనట్లు విచారణలో వెల్లడయ్యింది.టాపెంటాడోల్ హైడ్రోక్లోరైడ్ మందులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో ఇవ్వకూడదనే నిబంధన ఉందని, ఈవీ హెచ్1 లిస్ట్‌లో 2021లో నమోదయ్యాయని టీజీ న్యాబ్ తెలిపింది.ఇదిలాఉండగా.. నిందితుడు షాహిన్‌పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్లైన సీపీ-డాల్-100 బాధితులకు ఇచ్చాడని, వాటిని ఎక్కువ మొత్తంలో వాడితే ప్రాణాలకే ప్రమాదమని ఇద్దరు నిందితులకు అవగాహన ఉందని బాలాపూర్ పోలీసులు పేర్కొన్నారు. దీంతో నిందితులిద్దరిపై సెక్షన్ 105 (కల్పబుల్‌హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టూ మర్డర్, 278, 125 ఆర్/డబ్ల్యూ 3(5) బీఎన్‌ఎస్, సెక్షన్ 77 జువెనల్ జస్టిస్ యాక్ట్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

## ఇంటర్‌లో ఫెయిల్ అయ్యామని ముగ్గురు విద్యార్థుల ఆత్మహత్య

**ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యామని మనస్తాపం చెందిన వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.**

అరుంధతి (ఫైల్)

మన్సూరాబాద్, ఏప్రిల్ 22: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదన్న మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్ నగర్, తట్టి అన్నారం, వైయస్సార్ కాలనీకి చెందిన సుక్క రవికుమార్ కూతురు సుక్క అరుంధతి(17) ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతున్నది. మంగళవారం విడుదలైన పరీక్ష ఫలితాల్లో బాటనీ సబ్జెక్టులో అరుంధతి ఫెయిల్ అయింది. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన విద్యార్థిని మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకున్నది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం నాగోల్ లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అరుంధతిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతురాలి సోదరుడు గౌతం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

#### బంజారాహిల్స్‌లో మరొకరు...

బంజారాహిల్స్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలో ఓ సబ్జెక్ట్ ఫెయిల్ అయ్యాయని తీవ్ర మనస్థాపానికి గురైన బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నంబర్-2లోని ఇందిరానగర్ లో నివాసం ఉంటున్న సుమతి, రామకృష్ణ ల కూతురు బాలిక నిష్ఠ(16) స్థానిక అభ్యాస జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. మంగళవారం ఇంటర్ ఫలితాలు విడుదల కావడంతో ఆన్లైన్ లో చూసుకున్న నిష్ఠ కెమిస్ట్రీలో ఫెయిల్ అయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రామకృష్ణ దంపతులు కుమార్తె మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

#### బల్కంపేటలో ఇంకొకరు..

అమీర్పేట్, ఏప్రిల్ 22 : ఇంటర్ ఫలితాల్లో ఓ సబ్జెక్టు ఫెయిల్ అయ్యాననే బాధతో ఓ విద్యార్థి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అవంతినగర్ తోటలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. అవంతినగర్ తోటలో నివాసముంటున్న ప్రైవేట్ ఉద్యోగి సత్యనారాయణ కుమారుడు ప్రశాంత్(17) బల్కంపేటలోని 9 ఎడ్యుకేషన్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఓ సబ్జెక్టులో ఫెయిలైనట్టు తెలుసుకుపని తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో భార్య, అత్తపై దాడి

మియాపూర్, ఏప్రిల్ 22: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకున్నది. మద్యం మత్తులో భార్యతో పాటు అత్తపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. మియాపూర్ జనప్రియ నగర్‌లో నివాసం ఉండే మహేశ్ రెండేళ్ల కిందట శ్రీదేవిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఏడాది పైబడిన కూతురు ఉన్నది. క్యాబ్ డ్రైవర్ గా పని చేస్తున్న మహేశ్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు చోటుచేసుకుంటున్నాయి. మహేశ్ పెట్టే హింస భరించలేక శ్రీదేవి తన పుట్టింటికి వెళ్లింది. తన తమ్ముడి ఇంట్లో పుట్టినరోజు వేడుకలకు వెళ్లాల్సి ఉందని మహేశ్ భార్య శ్రీదేవిని పుట్టింటి నుంచి జనప్రియనగర్‌లోని తన ఇంటికి సోమవారం పిలిపించుకున్నాడు.ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో ఆవేశంతో మద్యం మత్తులో ఉన్న మహేశ్ కూరగాయలు కోసే కత్తితో భార్య శ్రీదేవిపై, అడ్డొచ్చిన అత్తపై దాడి చేశాడు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని దవాఖానకు తరలించారు. తీవ్రగాయాలతో శ్రీదేవి తల్లి ఐసీయూలో చికిత్స పొందుతుండగా, శ్రీదేవి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. శ్రీదేవి వాంగ్మూలం నమోదు చేసుకున్న మియాపూర్ పోలీసులు మహేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సుచిత్ర అశోకా చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ పై కేసు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22:ఆటిజంతో బాధపడుతున్న చిన్నారులను తల్లిదండ్రుల ఆలనాపాలన చూడాల్సిన చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్‌ల నిర్వాహకులు హద్దులుమీరి ప్రవర్తిస్తున్నారంటూ ఓ బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ విజయ్‌వర్ధన్, బాధితులు తెలిపిన ప్రకారం..కుత్బుల్లాపూర్‌కు చెందిన ఓ బాధిత తల్లిదండ్రులు తమ బాలిక అటిజం(వినికిడి సమస్య)తో బాధపడుతున్నది. కాగా, బాలికను మెరుగైన మానసిక స్థితిని తీసుకొచ్చేందుకు సుచిత్రలోని అశోకా చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్‌లో చేర్పించారు. అయితే ఆ బాలికను నిర్వాహకులు తీవ్ర ఇబ్బందితోపాటు దాడులకు పాల్పడుతున్నాడని బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో తల్లిదండ్రులు ఈనెల 19న పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అశోకా చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐపీఎల్ మ్యాచ్ నేపథ్యంలో..

### నేడు ఉప్పల్ స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 22(నమస్తే తెలంగాణ): ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ ఉండటంతో స్టేడియం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం 4 నుంచి రాత్రి 11.50 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని, చెంగిచర్ల, బోడుప్పల్, పీర్జాదిగూడ వైపు నుంచి వచ్చే వాహనాలను హెచ్ఎండీఏ భగాయత్ నుంచి నాగోల్ వైపు, ఎల్బీనగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద నుంచి హెచ్ఎండీఏ లేఅవుట్ వైపు, తార్నాక నుంచి వచ్చే వాహనాలను హబ్సిగూడ నుంచి చర్లపల్లి వైపు, రామంతాపూర్ నుంచి వచ్చే వాహనాలు స్ట్రీట్ నంబర్ 8 నుంచి హబ్సిగూడ వైపు మళ్లిస్తున్నట్లు వెల్లడించారు.

## ఐపీఎల్ మ్యాచ్‌కు ఆర్టీసీ బస్సులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్ జరగనున్నది. అందులో భాగంగా నగర నలుమూలల నుంచి క్రికెట్ అభిమానులకు ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ అధికారులు 60 ప్రత్యేక బస్సులను ఉప్పల్ స్టేడియానికి నడపనున్నారు. ఘట్‌కేసర్, హయత్‌నగర్, ఎన్‌జీఓ కాలనీ, ఇబ్రహీంపట్నం, ల్యాబ్ క్వార్టర్స్, కోఠి, అప్జల్‌గంజ్, లక్డీకపూల్, జీడిమెట్ల, మియాపూర్, హఫీజ్‌పేట్, ఈసీఐఎల్, బోయినపల్లి, బీహెచ్ఈఎల్, మెహిదీపట్నం తదితర ప్రాంతాల నుంచి స్టేడియానికి బస్సులు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. మరింత సమాచారం కోసం 99592 26160, 99592 26154 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

## ఎన్నికల వేళ.. ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, ఏప్రిల్22(నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధ, శుక్రవారం హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని జాయింట్ కమిషనర్ జోయల్‌డేవిస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీన పోలింగ్, 25న కౌంటింగ్ ఉన్న కారణంగా జీహెచ్ఎంసీ టీ జంక్షన్ నుంచి బీఆర్‌కేఆర్ భవన్ జంక్షన్ వరకు ఉన్న మార్గంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాహనదారులకు అనుమతిలేదని ఆయన పేర్కొన్నారు. వాహనదారులు ఈ విషయాన్ని ఈ రెండురోజులు జీహెచ్ఎంసీ రూట్‌లో కాకుండా వేరే మార్గాల్లో తమ ప్రయాణాన్ని కొనసాగించాలని జాయింట్ కమిషనర్ సూచించారు.

# చరిత్రలో నిలిచిపోయేలా..

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలందరిని ఒక్కతాటిమీదకు తెచ్చి తెలంగాణ సాధించుకున్న ధీరుడు కేసీఆర్.

#### ప్రజల గుండెల్లో కేసీఆర్..

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమనేత కేసీఆర్‌తో మాత్రమే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందన్న నమ్మకంతో 2014లో ప్రజలు టీఆర్ఎస్‌ను గెలిపించారు. కేసీఆర్ పదేళ్లపాటు జనరంజకమైన పరిపాలన అందించి వారి గుండెల్లో నిలిచిపోయా రు. ఆకలితో అలమటించిన పేదలకు కన్నకొడుకులా సంక్షేమ పథకాలు అందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో జరిగిన అభివృద్ధి దేశాన్నే ఆశ్చర్యపరిచేలా సాగింది. కేసీఆర్ సీఎంగా ఉన్నన్ని రోజులు నగరంలో మంచినీరు, కరెంట్ పుష్కలంగా ఉన్నాయి. దేశంలోనే లివబుల్ సిటీగా హైదరాబాద్‌కు ఘనత వచ్చింది.

#### కాంగ్రెస్ పాలనపై విసిగిన జనం..

అయితే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన ప్రజల గుండెల్లో మాత్రం ఉంది. ప్రజల తరపున నిరంతరం కొట్లాడుతోంది. 16 నెలల కాంగ్రెస్ పాలనలో జనం విసిగిపోయారు. కేసీఆర్ ఉంటే బాగుండు అంటూ జనం అంటున్నారు. అంతటి ప్రభావం చూపిన కేసీఆర్ పాలనను జనం మళ్లీ కోరుకుంటున్నారు. వరంగల్‌లో జరగనున్న రజతోత్సవ సభతో రాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకోవడం ఖాయం. జనం గుండెల్లో కేసీఆర్‌పై ఉన్న అభిమానం మరోసారి వరంగల్ సభ ద్వారా బయటపడనుంది. అన్ని నియోజకవర్గాల నుంచి 3వేల నుంచి 4వేలమంది దాకా వరంగల్ సభకు తరలివెళ్లేలా ప్రణాళికలు రూపొందించాం.

# భర్త హత్య కేసులో భార్య, మరో ఇద్దరి అరెస్టు

- 24గంటల్లో హత్య కేసును ఛేదించిన పోలీసులు
- కూతురి పెండ్లి విషయమే హత్యకు కారణం

కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో సాయిలు హత్య వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ రాజశేఖర్ రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 22: తనకు ఇష్టం లేకుండా.. తన కూతురు పెండ్లి చేసేందుకు యత్నిస్తున్న భర్తను భార్య మరో ఇద్దరితో కలిసి కరెంట్ షాక్ పెట్టి హత్య చేసిన కేసును ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో కేపీహెచ్‌బీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలు భార్యతోపాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. మంగళవారం కేపీహెచ్బీ కాలనీ పోలీస్ స్టేషన్లో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, కేపీహెచ్బీ కాలనీ సీఐ రాజశేఖర్ రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పాత లింగయ్యపల్లి గ్రామానికి చెందిన బోయిని సాయిలు (45), కవిత దంపతులకు ఒక కూతురు, కొడుకు ఉన్నారు. వీరికి పెండ్లయిన కొన్నేండ్లకే భార్యభర్తల మధ్య విభేదాలు రావడంతో గత 14 ఏండ్లుగా వేర్వేరు జీవిస్తున్నారు. కాగా, సాయిలు సొంత ఊర్లోనే పిల్లలతో కలిసి జీవిస్తుండగా, కవిత మాత్రం హైదరాబాద్ లో నివాసముంటున్నది. ఇటీవల సాయిలు తన కూతురి వివాహాన్ని అక్క కొడుకు (మేనల్లుడు)తో చేయాలని నిర్ణయించుకోగా.. దీనికి భార్య కవిత వద్దని వారించింది. దీంతో తన కూతురు పెండ్లి ఇష్టం లేకుండా చేస్తున్నాడని, భర్తను ఎలాగైనా చంపాలని పథకం వేసింది. అందులో భాగంగానే ఈనెల 12వ తేదీన ఊరికి వెళ్లి అతను పనిచేస్తున్న చోట రూ.20వేలు అప్పు చెల్లించింది. కూతురు పెండ్లికి ఎక్కువ డబ్బులు సంపాదిద్దామని భర్తకు నచ్చజెప్పి హైదరాబాద్‌కు తీసుకొచ్చింది. అనంతరం సాయిలును కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో ని మిత్రాహిల్స్ లో గుడిసెలో నివసిస్తున్న చెల్లెలు జ్యోతి, మరిది మల్లేష్ ఇంటికి తీసుకువచ్చింది. పథకం ప్రకారం... ఈనెల 19వ తేదీన రాత్రి సాయిలుకు బాగా కల్లు తాగించి మత్తులోకి వెళ్లగానే భార్య కవిత, చెల్లెలు జ్యోతి, మల్లేష్‌తో కలిసి కరెంట్ షాక్ పెట్టారు. కొన ఊపిరితో ఉన్నాడని భావించి గొంతు, మర్మాంగాలు పిసికి హత్య చేశారు. అనంతరం శవాన్ని మాయం చేసేందుకు ఒక కవర్లో మూటగట్టి ఓ ఆటోను కిరాయికి తీసుకొని సంగారెడ్డి సమీపంలోని చెరువులో వేసేందుకు యత్నించారు. దీంతో ఆటో డ్రైవర్ కు అనుమానం వచ్చి ఇది ఏమిటని ప్రశ్నించగా.. పొంతన లేని సమాధానం చెప్పారు. మీరు చేస్తున్న పనికి నేను సహకరించనని ఆటో డ్రైవర్ వల్లి నాయక్ అడ్డం తిరిగాడు. దీంతో తిరిగి ఇంటికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి సమీపంలోని ఓ నిర్మాణ ప్రదేశంలో గుంతలో శవాన్ని పూడ్చివేసి ఎవరి దారిన వారు ఇండ్లకు వెళ్లిపోయారు.

#### ఊరెళ్లి నాటకమాడిన భార్య..

భర్తను చంపిన కవిత... ఊరికి వెళ్లి తన భర్త పని కోసం వెళ్లి తిరిగి రాలేదని నాటకం ఆడటం మొదలుపెట్టింది. దీంతో అత్త, కొడుకు, కూతురు ప్రశ్నించగా.. పొంతన లేని సమాధానం చెప్పడంతో వారికి అనుమానం మొదలైంది. మరోవైపు ఆటో డ్రైవర్ ఉదయాన్నే కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని.. జరిగిన విషయాన్ని వివరించాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు జ్యోతి, మల్లేశ్ ఇంటికెళ్లి అదుపులోకి తీసుకొని విచారించారు. అలాగే ఊరికి వెళ్లిన కవితను తీసుకొచ్చి విచారించగా... వారు ముగ్గురు కలిసి పథకం ప్రకారం సాయిలును హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో ముగ్గురిని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. 24 గంటల్లో కేసును ఛేదించిన సిబ్బందిని పోలీస్ అధికారులు అభినందించారు.

# బిట్ కాయిన్ పేరుతో కీసరలో రూ.11లక్షల మోసం

పోలీసులను ఫిర్యాదు చేసిన కీసరకు చెందిన రాగుల శ్రీరంగం

కీసర, ఏప్రిల్ 22: బిట్ కాయిన్ పేరుతో బాధితులు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి మోసపోయిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. కీసర పోలీసులు తెలిపిన ప్రకారం... లైకా కాయిన్ పేరుతో కొంతమంది కేటుగాళ్లు రూ.10వేలు పెడితే రూ. 30వేలు ఇస్తామని అమాయకులను నమ్మించి మోసం చేశారు. అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి ఆన్‌లైన్ కంపెనీ పేరుతో భారీగా డిపాజిట్లు సేకరించిన నిందితులు పత్తా లేకుండా పోవడంతో పెట్టుబడి పెట్టిన బాధితులు లబోదిబోమంటున్నారు. లైకా బిట్ కాయిన్ ఆన్‌లైన్‌లో ఎత్తివేయడంతో కీసరకు చెందిన రాగుల శ్రీరంగం, వీరేంద్ర, బ్రహ్మచారి అనే బాధితులు రూ. 11లక్షలు పెట్టుబడి పెట్టి నష్టపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజులుగా కీసరలో నివసిస్తున్న నాగుల నర్సింహస్వామి, కరీంనగర్ ప్రాంతానికి చెందిన గుట్టు కుమారస్వామితో కలిసి దమ్మాయిగూడలోని పద్మశాలి కాలనీలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. లైకా బిట్ కాయిన్ పేరుతో ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ వెబ్‌సైట్‌లో రూ. 10వేలు పెడితే రూ.30వేల లాభాలు వస్తాయని నమ్మించడంతో బాధితులు ఆశలో పడి రూ.10వేల నుంచి లక్షల రూపాయల్లో పెట్టుబడి పెట్టారు. దమ్మాయిగూడలోనే బాధితులు సుమారు రూ. 3 కోట్ల వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలిసింది. ఉన్నట్టుండి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ఎత్తివేయడంతో మంగళవారం కీసరకు చెందిన బాధితులు రాగుల శ్రీరంగం తాను సుమారు రూ. 11 లక్షలు పెట్టుబడి పెట్టి నష్టపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. లైకా బిట్ కాయిన్ పేరుతో జరుగుతున్న మోసాలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని కీసర సీఐ శ్రీనివాస్ తెలిపారు.

## మన్నె క్రిశాంక్‌కు నోటీసులు

మాదాపూర్, ఏప్రిల్ 22: బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌కు 31 మార్చ్ 2024 న సీఎం రేవంత్‌రెడ్డిపై పక్క రాష్ట్రం నుంచి ఓటు వేసిన వారిని ఇక్కడకు తీసుకువచ్చి ఓటు వేయించండి అని రేవంత్ రెడ్డి స్టేట్మెంట్ ఇచ్చినట్లు ఆరోపణలు చేశారు. దీంతో ఆయనపై రాష్ట్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ కమిటీ కుమార్‌రావు ఫిర్యాదు చేయగా, నేను ఏ పోస్ట్‌ను పెట్టలేదని చెప్పారు. దీంతో ఆయనపై ఇటీవల గచ్చిబౌలి పోలీస్‌స